శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం: కౌసర్


అదనపు డీసీపీ అష్వాక్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గోల్కొండ: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకొని సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ మహ్మద్ అష్వాక్ ఆదివారం ఎమ్మెల్యేను టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తమ పరిధిలోని ఈద్గాలు, జామా మసీదులతో పాటు బక్రీద్ ప్రార్థనలు జరిగే మసీదుల వద్ద బందోబస్తు ఏర్పాట్లపై అదనపు డీసీపీ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాల్లో పోలీసులను నియమించాలని కోరారు. నానల్‌నగర్, టోలిచౌకీ చౌరస్తా, గోల్కొండ, రేతిబౌలి తదితర ప్రాంతాల్లో గొర్రెల విక్రయాలు బాగా జరుగుతాయని ఆయన అన్నారు. ఈ ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేకంగా ఎమర్జెన్సీ పోలీసు వాహనాలను కూడా నియమించాలని ఆయన అదనపు డీసీపీని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ...

ఎన్నికల కోడ్ ముగిసినందున గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వ సహాయం అందడం ప్రారంభమైందని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. ఆదివారం ఆయన మెరాజ్ కాలనీలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారు చెక్కు కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదని తానే సంబంధిత అధికారులను సంప్రదించి చెక్కులు త్వరగా మంజూరయ్యేలా చూడాలని కోరుతున్నానన్నారు.

విద్యార్థులు పట్టుదలతో కృషి చేస్తే అన్నీ సాధించొచ్చు


విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చాంద్రాయణగుట్ట: పట్టుదలతో కృషి చేస్తే సాధించలేనిదంటూ ఏమి ఉండదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తిరుపతి శివకుమార్ ఆధ్వర్యంలో అలియాబాద్‌లోని మున్నూరు కాపు సంఘం భవనంలో ఆదివారం పేద విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి విద్యార్థులే రేపటి పౌరులన్నారు. పాతనగర మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు సంఘ భవనానికి స్థలం కేటాయించాలని కోరడంతో సానుకూలంగా స్పందించిన ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు, మల్లెపల్లి ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ పుప్పాల జ్యోతి, వైద్యులు గంట యశ్వంత్ రావు, అశోక్ కుమార్, పొన్న బాలరాజ్, పుప్పాల మధుసూదన్‌రావు, రామ్మోహన్, గోవింద్ రాజ్, కె.రమేష్, తోట అశోక్ పాల్గొన్నారు.

బక్రీద్‌కు సర్వం సిద్ధం

- సామూహిక ప్రార్థనలకు ముస్తాబైన మీరాలం ఈద్గా, మక్కా మసీదు
- అదనపు బలగాలతో బందోబస్తు
- మీరాలం ఈద్గా రోడ్డులో కొనసాగనున్న ట్రాఫిక్ ఆంక్షలు


ఖుర్బానీకి సిద్ధంగా ఉన్న మేకలు, పొట్టేళ్ల వ్యాపారం

చార్మినార్: బక్రీద్ పండుగను పురస్కరించుకొని నిర్వహించే సామూహిక ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సామూహిక ప్రార్థనలకు పాతబస్తీ మీరాలం ఈద్గాను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆదివారం రాత్రి వర్షం కురవడంతో అవసరమైన మేరకు షామియానాలు, టెంట్‌లు ఏర్పాటు చేశారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో జానిమాస్‌లు ఏర్పాటు చేశారు. ముస్లింలకు ఎక్కడ ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలన్ని తీసుకున్నారు. మక్కా మసీదుతో పాటు మీరాలం ఈద్గా, మాదన్నపేట్ ఈద్గాల వద్ద మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించనున్నారు. తనిఖీల అనంతరమే సామూహిక ప్రార్థనలకు అనుమతించనున్నారు. మక్కా మసీదు ఖతీబ్ తదితరులు సామూహిక ప్రార్థనలు చేయించనున్నారు. బక్రీద్ సామూహిక ప్రార్థనల కోసం దక్షిణ మండలం పోలీసులు అదనపు బలగాలతో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

పాతబస్తీలో భారీ బందోబస్తు..

సోమవారం ఉదయం మీరాలం ఈద్గాలో జరగబోయే సామూహిక ప్రార్థనలను పురస్కరించుకొని దక్షిణ మండలం పోలీసు అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి ఇప్పటికే మీరాలం ఈద్గాను సందర్శించారు. మీరాలం ఈద్గాలో ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించారు. సామూహిక ప్రార్థనలకు సెల్‌ఫోన్లు, వాటర్ బాటిల్స్ తీసుకు రావద్దని..తనిఖీలకు ముస్లిం సోదరులు సహకరించాలని దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా అన్నారు. వాహనాలను తాము సూచించిన స్థలంలోనే పార్కింగ్ చేయాలని..ఈద్గాలోనికి వాహనాలను తీసుకువెళ్లరాదని దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్ సూచించారు. మీరాలం ఈద్గాలో జరిగే సామూహిక ప్రార్థనల సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. తమ సిబ్బంది సూచనల మేరకు వాహనదారులు ముందుకు వెళ్లాలని ఆయన కోరారు.

కూడళ్లలో కిటకిట..

బక్రీదు పండుగ కోసం అవసరమైన గొర్రెలు, మేకలను ఖరీదు చేస్తుండడంతో పాతబస్తీ సందడిగా మారింది. బక్రీదు పండుగ కోసం గ్రేటర్ శివారు జిల్లాల నుంచి గొర్రెలు, మేకలు పాతబస్తీకి తరలించారు. దీంతో పాతబస్తీలోని ప్రధాన కూడళ్లు అయినా డబీర్‌పురా, చంచల్‌గూడ, పురానీహవేలీ, మీరాలంమండి, మొఘల్‌పురా, రెయిన్‌బజార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, చార్మినార్, పేట్ల బురుజు, పురానాపూల్, బార్కాస్, యాకుత్‌పురా తదితర ప్రాంతాలు వినియోగదారులతో కిక్కిరిసిపోతున్నాయి. తమకు కావాల్సిన గొర్రెలు, మేకలను ఖరీదు చేయడానికి ఆయా ప్రాంతాల ప్రజలు నిమగ్నమయ్యారు.

మార్కెట్‌లో బక్రీద్ పండుగ సందడి..

గోల్కొండ: మెహిదీపట్నం, అహ్మద్‌నగర్, టోలిచౌకీ, గోల్కొండ తదితర ప్రాంతాల్లో బక్రీద్ సందడి నెలకొంది. పొట్టేళ్లు, మేకపోతుల విక్రయాలు బాగా జరుగుతున్నాయి. పరిసర ప్రాంతాల నుంచి షీప్ ఫామ్ వారితో పాటు గొర్రెల కాపరులు పెద్ద సంఖ్యలో తమతమ పొట్టేళ్లు, మేకపోతులను అమ్ముతున్నారు. బక్రీద్ పండుగ రోజు చాలా మంది ముస్లింలు డబుల్ కా మీటా చేస్తారు. టోలిచౌకీలోని బేక్ వెల్ బేకరీ, గోల్కొండలోని షాలీమార్ బేకరీ, డబుల్‌కా మీటా బ్రెడ్‌కు పేరుగాంచింది. ఈ బేకరీల వద్ద డబుల్ కా మీటా తయారీ కోసం ప్రత్యేకంగా బ్రెడ్‌లను తయారు చేస్తారు. ఆదివారం ఉదయం నుంచి బ్రెడ్‌ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

ఈద్గాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు..

గోల్కొండ: ఈద్గాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ తెలిపారు. ఆదివారం ఆయన గోల్కొండలోని జామా మజీదు, బంజారా దర్వాజ సమీపంలోని కుతుబ్‌షాహీ ఈద్గాను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈద్గాలకు వచ్చే ప్రధాన రహదారుల వద్ద ప్రజలకు సహకరించడానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. బంజారా దర్వాజ వద్ద ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ట్రాఫిక్ పోలీసులతో పాటు తమ సిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం షేక్‌పేట్ టోలిచౌకీ నుంచి బంజారా దర్వాజ గుండా వచ్చే వాహనాల వారు నదీమ్ కాలనీ నుంచి గోల్కొండ వెళ్లాలని ఆయన సూచించారు. అదే విధంగా కుతుబ్ షాహీ ఈద్గాకు ప్రార్థనలకు వెళ్లే వారి కోసం డెక్కన్ పార్కు, సెవన్ టూమ్స్ గేట్లను కూడా తీసి ఉంచుతున్నామని తెలిపారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చార్మినార్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంత్‌రావు అన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని ఆయా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ అధికారులతో సంప్రదించి పరిష్కరించాలని ఆయన యువ నాయకులకు సూచించారు. పాతబస్తీకి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, డల్లు యువసేన అధ్యక్షుడు డల్లు శివ ఆధ్వర్యంలో కొంత మంది యువకులు ఆదివారం వి.హనుమంత్‌రావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సన్మానం


ఎస్.ఎం.హుస్సేన్‌ను సత్కరిస్తున్న కేఆర్ రాజ్‌కుమార్

నాంపల్లి: టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎం.హుస్సేన్ నియమితులైన సందర్భంగా టీఎన్జీఓ విద్యా శాఖ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం నాంపల్లిలోని హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓ కార్యాలయంలో సత్కార సభను ఏర్పాటు చేశారు. డీఈఓ యూనిట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్‌కుమార్ నేతృత్వంలో యూనిట్ కార్యవర్గం సభ్యులు హాజరై ఎస్.ఎం.హుస్సేన్‌ను గజమాలతో సత్కరించారు. ఈ సత్కార సభలో యూనిట్ కార్యదర్శి ఎం.భాస్కర్, సహాధ్యక్షులు డెవిడ్, కోశాధికారిగా ప్రేమ్, ఉపాధ్యక్షులు ఎం.రవి, సంయుక్త కార్యదర్శి జయంతి రెడ్డి, కార్యవర్గ సభ్యులు ముజాహిద్, జిల్లా సంఘం ఉపాధ్యక్షులు కురాడి శ్రీనివాస్ హాజరయ్యారు.

దత్తాత్రేయను కలిసిన దేవర శ్రీనివాస్



గోల్కొండ: భారత దేశం ప్రజాస్వామ్య విలువలను గౌరవించే దేశం అని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ బండారు దత్తాత్రేయను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన దత్తాత్రేయకు జ్ఞాపిక అందజేశారు.

కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా పరమేశ్వరి సింగ్


పరమేశ్వరి సింగ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ రోహిన్‌రెడ్డి

అబిడ్స్: ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా గోషామహల్ నియోజకవర్గానికి చెందిన మంగళ్‌హాట్ మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సి.రోహిన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం పరమేశ్వరి సింగ్‌కు ఆయన నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పరమేశ్వరి సింగ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంతో పాటు ఖైరతాబాద్ జిల్లా నలుమూలల సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తూ పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దారన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన అధ్యక్షుడు రోహిన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున, కాంగ్రెస్ అగ్ర నాయకులు ప్రియాంక గాంధీ, రాహుల్‌గాంధీ, సోనియగాంధీలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

అనిల్‌కుమార్ యాదవ్‌కు బాధ్యతలు అప్పగించాలి


అనిల్‌కుమార్

గన్‌ఫౌండ్రీ: బోనాల వేడుకలకు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌కు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని యువజన కాంగ్రెస్ అధికార ప్రతినిధి కోటం అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆదర్శ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..భాగ్యనగరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల వేడుకలు, బల్కంపేట ఎల్లమ్మతల్లి కల్యాణోత్సవ వేడుకల బాధ్యతలను అనిల్‌కుమార్ యాదవ్‌కు అప్పగించాలన్నారు. భాగ్యనగరంలో పుట్టిపెరిగిన వ్యక్తిగా ఎంతో అవగాహన కలిగిన వ్యక్తి అనిల్‌కుమార్ యాదవ్ అని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయంలో స్పందించి గత సంవత్సరం కంటే ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎంఎన్‌జేలో అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేన్, ఏఆర్ రాజ్‌కుమార్ తదితరులు

అబిడ్స్: అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా పలు సంవత్సరాలుగా పనిచేస్తూ, కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శుభ సందర్భంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి ఆవరణలో సుమారు 600 మంది నిరుపేద రోగులకు, వారి సహాయకులకు అన్నదాన చేశారు. కేన్సర్ బారిన పడిన పేద రోగులకు అన్నదానం చేయడం దేవుడు తనకిచ్చిన గొప్ప వరం అని ముజీబ్‌హుస్సేని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు కేఆర్.రాజ్‌కుమార్, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్రి, బొల్లిగిద్ద శంకర్, మొహ్మద్ వహీద్, ముస్తఫా, షరీఫ్, ఆసుపత్రి సభ్యులు శివకుమార్, మొహ్మద్ హబీబ్, చావూష్ పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖలు పాత బకాయిలు చెల్లించాలి


ఉప ముఖ్యమంత్రికు వినతిపత్రం అందజేస్తున్న రహ్మత్‌అలీ తదితరులు

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖలో గత సంవత్సరం నుంచి హెల్త్ కార్డ్స్ పేమెంట్స్, స్వీపర్లకు ఇవ్వాల్సిన పాత బకాయిలను వెంటనే ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను తెలంగాణ వాణిజ్య పన్నుల ఎన్జీఓస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రహ్మత్ అలీ పేర్కొన్నారు. భట్టి విక్రమార్కకు అసోసియేషన్ ఆధ్వర్యంలో మెమోరాండం అందజేసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రహ్మత్‌అలీ మాట్లాడుతూ.. గత సంవత్సర కాలంగా బీఆర్ఎస్ ప్రభుత్వంతో కూడా పాత బకాయిలు ఇవ్వకపోవడంతో పలువురు అవస్థల పాలవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి దేవులపల్లి శ్రీనివాసరావు అసోసియేట్ అధ్యక్షుడు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ మహంకాళి మాతేశ్వరీ ఆలయ పునర్‌నిర్మాణ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు అమ్మవారి మహాభిషేకం, అలంకరణ, అర్చన, హారతి, నైవేద్యం, మంత్ర పుష్పం తదితర పూజలు కొనసాగాయి. సాయంత్రం 6 గంటలకు కుంకుమార్చన, అనంతరం మహా హారతి నిర్వహించారు. రాత్రి 8 గంటలకు నిర్వహించిన పల్లకీ సేవలో భక్తులు భారీగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్ పర్యవేక్షణలో ఈ వార్షికోత్సవం కొనసాగింది.

నయనానందకరం..కవల నర్తకీమణుల నృత్యం



నాంపల్లి: అంగిక సాత్వికాభినయాలతో యువ(కవల) నర్తకీమణులు రవీనా, రిషిత చేసిన భరతనాట్య నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నృత్య గురువు పసుమర్తి రామలింగ శాస్త్రి పర్యవేక్షణలో యువ నర్తకీమణులు తొలి ప్రదర్శనలిచ్చి శభాష్ అనిపించుకున్నారు. రవీనా, రిషిత 2020లో గురువు పసుమర్తి రామలింగ శాస్త్రి దగ్గర శిక్షణ పొందేందుకు భరతనాట్యంలో చేరారు. వీరిద్దరు భరతనాట్యంతో పాటుగా కర్ణాటక సంగీతంలో కూడా గురు పద్మశాస్త్రి దగ్గర శిక్షణ పొందుతున్నారు. పుష్పాంజలి, గణేష పంచరత్నం, జతిస్వరం, శబ్దం, పదవర్ణం, కీర్తనం, తిల్లానా, మంగళంతో కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు. ముఖ్య అతిథులుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మంజుల రామస్వామి, సీనియర్ పాత్రికేయులు వల్లీశ్వర్, మానస మూర్తి అప్పారావు హాజరై కవల నర్తకీమణులను ఆశీర్వదించారు.

ఉచితంగా కంటి అద్దాల పంపిణీ


మహిళకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఆకుల శ్రీరాములు

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు అన్నారు. గత నెల తమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించామన్నా రు. ఈ శిబిరంలో కంటి వైద్య పరీక్షలు చేయించుకు న్న వారికి ఆదివారం ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి తనతో పాటు సంఘం ప్రధాన కార్యదర్శి బి ట్ల హంసరాజ్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.చంద్రకుమార్ తదితరుల ఆధ్వర్యంలో ఈ ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం జరిగిందని.. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ కొండ శ్రీనివాస్ రావు, సంఘం ఉపాధ్యక్షుడు ప్రభాకర్, బల్లేపు ఉపేందర్, పల్లే శ్రావణ్, భారత్ కుమార్, పోసూ క్రిష్ణ, అల్లం భానుమూర్తి, శ్రీధర్ రావు, కిషన్‌రావు, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా సేవా భారతి సంస్థ


ఉచిత మెడికల్ క్యాంపులో పాల్గొన్న కార్పొరేటర్ లాల్‌సింగ్ తదితరులు

అబిడ్స్: సమాజ సేవకు సేవా భారతి సంస్థ చేస్తున్న కృషి అమోఘమని గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్ పేర్కొన్నారు. దేవిబాగ్‌లో హనుమాన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా భారతి బృందం నిర్వహించిన మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా లాల్‌సింగ్ మాట్లాడుతూ..సేవా భారతి సంస్థ ఎన్నో సంవత్సరాలుగా పేద బడుగు వర్గాల కోసం నిరంతరం మెడికల్ క్యాంపులతో పాటు ఇతర పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ పేద ప్రజలకు అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో సేవాభారతి సంస్థ సభ్యులు రామారావు, లింగం అశోక్, బీజేపీ సీనియర్ నాయకులు నరహరి, డాక్టర్లు ఖలీల్, డాక్టర్ భార్గవ్, అసోసియేషన్ సభ్యులు జగన్నాథ్ సింగ్, గణేష్ సింగ్, మహేందర్ సింగ్, మదన్ సింగ్, సుధాకర్ గౌడ్, అక్షయ్ సాహూ పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అభ్యర్థులను ఎంపిక చేయాలి


శివచంద్రగిరి

గౌలిపురా: గ్రూపు–1 మెయిన్స్ అభ్యర్థుల ఎంపిక విషయంలో గతంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా కట్టుబడి 1:100 ప్రకారం మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేయాలని రాష్ట్ర యువమోర్చా అధికార ప్రతినిధి ఎ.శివచంద్రగి డిమాండ్ చేశారు. అదే విధంగా గ్రూప్–2, గ్రూపు–3కి సంబంధించి ఏప్రిల్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి వాటిలో పోస్టులు పెంచుతామని ఇచ్చిన హామీ ప్రకారం కట్టుబడి ఉండాలన్నారు. పోస్టులు పెంచి విడుదల చేసిన నోటిఫికేషన్‌కు కొత్తగా ఫీజులు వసూలు చేయమని చెప్పిన కాంగ్రెస్ ఈరోజు మళ్లీ నిరుద్యోగుల వద్ద పైసలు వసూలు చేయడం సరైంది కాదన్నారు. ఎన్నికల ముందు జాబ్ కేలండర్ అని చెప్పిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఏది జరగడం లేదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి


ట్రాఫిక్ పోలీసులతో సమావేశమైన గాజుల అంజయ్య

చార్మినార్: ప్రస్తుతం పండుగ సీజన్ కొనసాగుతున్నందున మీరాలంమండి ప్రధాన రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మీరాలంమండి ఫుడ్ గ్రేన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల అంజయ్య సంబంధిత మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసులను కోరారు. ఈ మేరకు మీర్‌చౌక్ సబ్ ఇన్‌స్పెక్టర్లు అమర్‌నాథ్‌రెడ్డి, అనురాధతో సమావేశమై మీరాలంమండిలో స్థానిక వ్యాపారస్తులు తమ తమ దుకాణాల ముందు రెండు మూడు అడుగుల మేర రోడ్డు కబ్జా చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్న విషయాలను వారితో చర్చించారు. ఇక్కడ ట్రాఫిక్ జాం నిత్యం జరుగుతోందని.. అటు వ్యాపారస్తులతో పాటు వినియోగదారులు, అమ్మవారి భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతారన్నారు. రోడ్డుపై ఉన్న కబ్జాలను ఎప్పటికప్పుడు తొలగిస్తే.. మీరాలంమండిలో ట్రాఫిక్ సమస్యలుండవని ఆయన వారికి వివరించారు.

'బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం'


గాజుల అంజయ్యను సన్మానిస్తున్న ప్రతినిధులు

చార్మినార్: ఈసారి బోనాల జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య అన్నారు. హరిబౌలిలోని మహేశ్వరి పోచమ్మ మహంకాళి ఆలయ కమిటీ అధ్యక్షుడు దినేష్ ఆధ్వర్యంలో ఆదివారం మీరాలంమండిలో ఆయనను కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. తమతమ ఆలయాల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం వెంటనే వినతి పత్రాలను అందజేయాలన్నారు. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్ పాటేల్ సదానంద్ యాదవ్, మధుసూదన్ యాదవ్‌లతో పాటు ప్రభునాథ్, శ్రావన్‌కుమార్, సంగ ప్రకాష్, సుశీల్ పాల్గొన్నారు.

లలితాబాగ్‌లో..

చాంద్రాయణగుట్ట: లలితాబాగ్‌లోని నల్ల పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎడ్ల పండరీనాథ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్యను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. బోనాల ఉత్సవాల నిర్వహణపై ఈ సందర్భంగా చర్చించారు. ఆలయ కమిటీ వైస్ చైర్మన్ మధుకర్, సలహాదారుడు అనంత రామారావు, ఉపాధ్యక్షులు రూపేష్, మస్కు వేణు కుమార్‌తో పాటు మధుసూదన్, ధన్‌రాజ్, జగదీష్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

అబిడ్స్: గంజాయి విక్రయిస్తున్న ఓ మహిళను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన ధూల్‌పేట పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, గోపాల్ వివరాల ప్రకారం.. ధూల్‌పేటకు చెందిన అనురాధ, ఆమె కుమారుడు దుర్గేష్ సింగ్ కలిసి తమ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇంటిపై దాడులు చేశారు. అనురాధ పట్టుపడగా ఆమె కుమారుడు పరారయ్యాడు. ద్విచక్ర వాహనంతో పాటు 8.26 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించొద్దు

- జులై 28, 29 తేదీల్లో లాల్‌దర్వాజా 116వ వార్షిక బోనాలు
- ఢిల్లీలో జులై 8,9,10 తేదీలలో బోనాలు


విలేకర్ల సమావేశంలో బంగారు నగలను చూపుతున్న కమిటీ సభ్యులు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ ప్రతిష్టకు భంగం కలిగేలా ఆరోపణలు చేయడం బహిష్కరణకు గురైన కమిటీ సభ్యులకు తగదని ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్‌యాదవ్ హితువు పలికారు. ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..2022–23 సంవత్సరంలో ఫోర్‌మెన్ కమిటీ చైర్ పర్సన్‌గా పనిచేసిన వారు ఆదాయ, వ్యయాలకు సంబంధించిన వివరాలను కమిటీకి అందజేయలేదన్నారు. అందుకే సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు. ఆ నలుగురిలో ఒకరైన శీర రాజ్‌కుమార్ వారితో సంబంధం లేదంటూ ముందుకు వచ్చి లోటులో నాలుగో భాగం చెల్లిస్తానని ముందుకు రావడంతో తిరిగి కమిటీలో చేర్చుకున్నామన్నారు. వారు కూడా ముందుకు వచ్చి డబ్బులు చెల్లించి, మినిట్స్ బుక్ అందజేసినట్లయితే తిరిగి చేర్చుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు మారుతీయాదవ్, చంద్రకుమార్, కోశాధికారి సతీష్‌ముదిరాజ్, కన్వీనర్ అరవింద్‌గౌడ్‌తో పాటు కె.వెంకటేష్, విష్ణు గౌడ్, బంగ్లా రాజు యాదవ్, తిరుపతి నర్సింగ్ రావు పాల్గొన్నారు.

జులై 19 నుంచి బోనాలు..

లాల్‌దర్వాజా 116వ వార్షిక బోనాల బ్రహ్మోత్సవాల ను జులై 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపారు. 21న ఘట స్థాపన, 28న బోనాలు, 29న పోతరాజు స్వాగతం, రంగం, ఊరేగింపు ఉంటాయన్నారు.

- జులై 8, 9, 10 తేదీల్లో ఢిల్లీలో మూడు రోజుల పాటు లాల్‌దర్వాజా మహంకాళి 10వ వార్షిక బోనాలను నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ భవన్‌లో 8న ఫొటో ఎగ్జిబిషన్, 9న ఇండియా గేట్ నుంచి అమ్మవారి ఘటం ఊరేగింపు, 10న బోనాల సమర్పణ, పోతరాజుల స్వాగతం ఉంటుందన్నారు.

అమ్మవారిపై 2.18 కిలోల బంగారం, 100 కిలోల వెండి..

మహంకాళి అమ్మవారిపై 2.18 కిలోల బంగారు ఆభరణాలు ఉన్నాయని చైర్మన్ తెలిపారు. 2011లో చోరీ జరిగిన సమయంలో అమ్మవారిపై 10 తులాల బంగారు ఆభరణాలు ఉండగా, చోరీ అనంతరం పోలీసులు నాలుగు తులాల ఆభరణాలు స్వాధీనం చేయించారన్నారు. అనంతరం దాతల సహకారం, బోనాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఇచ్చే నగదుతో ఏటా ఆభరణాలు చేయిస్తూ వస్తున్నామన్నారు. ఇలా అమ్మవారిపై 2.18 కిలోల బంగారు ఆభరణాలు, 100 కిలోల వెండి ఆభరణాలు ఉన్నాయని తెలిపారు.